సాక్షి
తూర్పుగోదావరి

ఆదివారం । 25 । మే । 2025



అమ్మా నాన్నా లేరని.. ఇక రారని

కళ్లెదుటే తమ తల్లిదండ్రులు మృత్యువాత పడటం చూసి, ఆ పసివాళ్లు గుండెలవిసేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.


8లో



శ్రీనివాసా... శ్రీవేంకటేశా

వాడపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రం భక్తజనంతో పులకించింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 10,797 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.40 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

స్మార్త పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

రాజమహేంద్రవరం సిటీ: కోటిలింగాలపేటలోని పందిరి మహదేవుడు కోటిలింగాల సత్రంలో నిర్వహిస్తున్న స్మార్త పాఠశాలలో ప్రవేశానికి బ్రాహ్మణ బాలుర నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పందిరి మహదేవుడు సత్రం సహాయ కమిషనర్ పి.విశ్వనాథరాజు శనివారం ఈ విషయం తెలిపారు. ఆరేళ్ల కృష్ణ యజుర్వేద స్మార్త విద్యను అభ్యసించేందుకు తొమ్మిదేళ్ల నుంచి 14 ఏళ్లలోపు ఉపనయనం జరిగిన బాలురు అర్హులన్నారు. వారికి ఉచిత వసతి, భోజనం, వైద్య సదుపాయం ఉంటుందని, నెలకు రూ.2 వేల వంతున ఉపకార వేతనం అందిస్తామన్నారు. దరఖాస్తులను సత్రం కార్యాలయంలో జూన్ 9వ తేదీ వరకు పొందవచ్చన్నారు. జూన్ 11 ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశానికి మౌఖిక పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ దరఖాస్తులు పంపించాలని కోరారు.

కోవిడ్ నిబంధనలు పాటించండి



ప్రిన్సిపాల్స్, డీన్స్‌తో సమావేశమైన వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: యూనివర్సిటీ, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లతో పాటు అనుబంధ కళాశాలల్లో ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ ఆదేశించారు. ప్రిన్సిపాల్స్, డీన్స్‌తో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కోవిడ్ కేసులు మరోసారి పెరుగుతున్నందున అప్రమత్తత ఎంతో అవసరమన్నారు. గతంలో మాదిరిగా మాస్కులు ధరించాలని, సామాజిక దూరాన్ని పాటించాలని, శానిటైజర్లతో చేతులు శుభ్రపరచుకోవాలని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో నియామకాలు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి నల్లమిల్లి కాంతమ్మ (అనపర్తి), ఆచంట అనసూయ (గోపాలపురం), బూత్ కమిటీ వింగ్స్ కార్యదర్శిగా బొడ్డు ముత్యాల రావు (అనపర్తి), జాయింట్ సెక్రటరీగా కళ్యాణం రాంబాబు (రాజానగరం), ఇంటలెక్చువల్ ఫోరం కార్యదర్శిగా పెండ్యాల వీర రాఘవులు (గోపాలపురం), ఒంగ్రు సత్యనారాయణ (అనపర్తి), ఎంప్లాయీస్ పెన్షనర్స్ వింగ్ జాయింట్ సెక్రటరీగా కె.సత్రాజు (రాజానగరం), పబ్లిసిటీ వింగ్ కార్యదర్శిగా మందా రాజారెడ్డి (అనపర్తి), తాడి హరిచంద్ర ప్రసాద్ రెడ్డి (రాజానగరం) నియమితులయ్యారు.

ఉపాధ్యాయ బదిలీ దరఖాస్తుల గడువు పెంపు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా స్కూల్ అసిస్టెంట్లు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించే గడువును మరో రోజుకు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు శనివారం రాత్రి తెలిపారు. ఆ ప్రకారం ఆదివారం రాత్రి 11.45 గంటల వరకూ అవకాశం ఉందన్నారు. డివిజన్ ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని ఉపాధ్యాయులకు ఈ సమాచారాన్ని అందజేయాలన్నారు.

స్వామిని చూసి.. మది మురిసి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. స్వామివారికి తలనీలాలు సమర్పించారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.3,49,554 ఆదాయం వచ్చిందని ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు. స్వామి వారిని 5,500 మంది స్వామి దర్శించుకోగా, నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.93,351 ఆదాయం వచ్చిందని తెలిపారు.

5 నుంచి బాలాజీ కల్యాణోత్సవాలు

అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి తిరు కల్యాణోత్సవాలు వచ్చే నెల 5వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. జూన్ 9 వరకూ ఈ కల్యాణోత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 6వ తేదీ రాత్రి 9.15 గంటలకు స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం 11.31 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాలకు శ్రీకారం చుడతామన్నారు.

● మాకు లేదా.. ప్రాధాన్యం?

అన్నదాతల సమరభేరి

- ధాన్యం సొమ్ము చెల్లించని కూటమి సర్కార్
- రూ.143.4 కోట్ల మేర బకాయి
- నెల రోజులుగా రైతుల ఎదురు చూపులు
- ఆగ్రహంతో రోడ్డెక్కిన అన్నదాతలు
- ఎలా బతకాలని ఆవేదన
- కానూరు, డి.ముప్పవరంలో ఆందోళనలు



నిడదవోలు మండలం డి.ముప్పవరంలో ధాన్యం డబ్బులు చెల్లించాలని నినదిస్తున్న రైతులు



కానూరులో రోడ్డుపై ట్రాక్టర్లు నిలిపి, టెంట్ వేసి బైఠాయించిన రైతులు



రైతుల ఆందోళనతో కానూరులో నిలిచిపోయిన వాహనాలు

పెరవలి: అప్పులు తెచ్చారు.. పెట్టుబడులు పెట్టారు.. కౌలు చెల్లించారు.. ఎరువులు, పురుగు మందులు జల్లారు.. ప్రకృతి విపత్తులకు ఎదురీదారు.. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకున్నారు.. చివరకు పసిడి గింజలు పండించారు.. తీరా చూస్తే కొనుగోళ్ల సమయంలో టార్గెట్ల పేరుతో మోసం.. పండించిన లక్షల టన్నుల ధాన్యం గింజలు ఏం చేసుకోవాలో తెలియక ఆక్రోశం.. దళారుల దగా.. ఆందోళనకు దిగితే ముష్టి విదిల్చినట్లు కొనుగోలు టార్గెట్ మరో లక్ష టన్నుల పెంపు.. సరేననుకుంటే కొన్న ధాన్యానికి నెల రోజులుగా నయాపైసా కూడా చెల్లించడం లేదు.. ఇటువంటి వేదనాభరితమైన పరిస్థితుల్లో అన్నదాతలకు కడుపు మండింది.. పండించిన ప్రతి ధాన్యం గింజా రైతుల నుంచి కొనుగోలు చేస్తామని, ఇది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పడమే తప్ప.. కూటమి సర్కారు తమకు ఒరగబెట్టిందేమీ లేదని కన్నెర్రజేశారు. తమపై ఈ చిన్నచూపు ఏమిటని, కొన్న ధాన్యానికి డబ్బులెప్పుడిస్తారని ప్రశ్నిస్తూ పోరుబాట పట్టారు. పెరవలి మండలం కానూరు, నిడదవోలు మండలం డి.ముప్పవరం గ్రామాల్లో రహదారులు దిగ్బంధించారు.

కొనుగోలు నుంచే దగా

జిల్లావ్యాప్తంగా రైతులు రబీలో 58,586 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. మొత్తం 5.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ, అనూహ్యంగా ప్రభుత్వం 2.50 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేయాలని మొదట లక్ష్యంగా నిర్ణయించింది. ఈ లక్ష్యం పూర్తయిపోయిందంటూ ప్రభుత్వ యంత్రాంగం కొనుగోళ్లు నిలిపివేయడం.. ధాన్యం తీసుకోవడానికి మిల్లర్లు నిరాకరించడం.. అదే సమయంలో అకాల వర్షాలు కురవడంతో.. మిగిలిన ధాన్యం ఏం చేయాలో, ఎలా కాపాడుకోవాలో అర్థం కాక పలు ప్రాంతాల్లో రైతులు ఆందోళనలకు దిగారు. తమ వద్ద ఉన్న ధాన్యం ప్రభుత్వమే కొనుగోలు చేయాలంటూ కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు తదితర మండలాల్లో తీవ్ర స్థాయిలో నిరసనలు తెలిపారు. దీంతో, దిగివచ్చిన ప్రభుత్వం ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 3.50 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచింది. ఇంత అస్తవ్యస్త విధానాలతో ధాన్యం కొనుగోలు చేసిన సర్కారు.. నెల రోజులు గడుస్తున్నా నేటికీ సొమ్ము జమ చేయకపోవడంతో రైతులు మండిపడుతున్నారు.

ఇంత మోసమా?

ఈ నెల 22వ తేదీ వరకూ 3.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు. మరో 13 వేల మెట్రిక్ టన్నులు సేకరిస్తే లక్ష్యం పూర్తవుతుంది. ఇప్పటి వరకూ సేకరించిన ధాన్యానికి సంబంధించి రైతులకు రూ.776 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇందులో రూ.632.6 కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. అది కూడా ఈ నెల 7వ తేదీ వరకూ మాత్రమే చెల్లించారు. మరో రూ.143.4 కోట్లు చెల్లించాల్సి ఉంది. పెరవలి మండలంలో రూ.4.39 కోట్లు, కానూరు రైతులకు రూ.1.39 కోట్లు, నిడదవోలు మండలంలో 605 మంది రైతులకు రూ.8.22 కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. ఇదే విధంగా దాదాపు ప్రతి మండలంలోనూ రూ.5 నుంచి 10 కోట్ల వరకూ రైతులకు చెల్లించాల్సి ఉందని సమాచారం. అదనంగా సేకరించిన లక్ష టన్నుల ధాన్యానికి సొమ్ము చెల్లించకుండా ప్రభుత్వం తమను మోసం చేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమందికి ఏప్రిల్‌లో సేకరించిన ధాన్యానికి సైతం ఇప్పటి వరకూ డబ్బులు జమ చేయలేదని, ఇలాగైతే తాము ఏవిధంగా బతకాలని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు పెద్ద రైతులకు సొమ్ము జమ చేసి, కౌలు, సన్న, చిన్నకారు రైతులకు ఇవ్వడం లేదని, దీంతో తాము ఆర్థికంగా నలిగిపోతున్నామని వాపోతున్నారు. ఈ డబ్బులు రాకపోతే పంటకు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని, కౌలు ఎలా చెల్లించాలని, ఖరీఫ్ సాగుకు పెట్టుబడి ఎక్కడి నుంచి తేవాలని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదిగో అదిగో అంటున్నారు



ఏప్రిల్ 29న మూడెకరాల పంటకు చెందిన ధాన్యం అమ్మాను. నేటికీ సొమ్ములు పడలేదు. అధికారులను అడుగుతూంటే ఇదిగో వస్తాయి, అదిగో వస్తాయని అంటున్నారే తప్ప సొమ్ము రాలేదు. ఇలాగైతే వ్యవసాయం ఎలా చేసేది?

– నిచెనకోళ్ల కృష్ణమూర్తి, వరి రైతు, కోరుపల్లి

కాళ్లరిగేలా తిరిగినా..



ధాన్యం టార్గెట్ అయిపోయిందన్నారు. ఆందోళన చేస్తే ధాన్యం తీసుకున్నారు. కానీ నెల రోజులైనా సొమ్ము మాత్రం వేయలేదు. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాం. చివరకు రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నాం.

– తుమ్మలపల్లి సత్యనారాయణ, రైతు, కానూరు

డబ్బు రావడం లేదు



ధాన్యం నేటికీ రాశుల్లోనే ఉంది. అనుమతులు రాలేదంటున్నారు. పోనీ, అమ్మిన ధాన్యానికి సొమ్ము వస్తే అప్పులు తీరుద్దామంటే ఆ డబ్బులు రావడం లేదు. అధికారుల చుట్టూ తిరగలేకపోతున్నాం. వ్యవసాయం చేసేకన్నా అడుక్కుంటే మంచిదిలా ఉంది.

– కేతా శ్రీనివాస్, వరి రైతు, ముక్కామల

రైతుల గోడు ఆలకించరా..!

నిడదవోలు రూరల్: రబీలో పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయడంతో పాటు నెల రోజులుగా నుంచి పెండింగ్ పెట్టిన డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అన్నదాతలు శనివారం ధర్నా నిర్వహించారు. నిడదవోలు మండల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ఎస్‌కే) ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని జీడిగుంట, పందలపర్రు, కోరుపల్లి, పెండ్యాల, మునిపల్లి, కలవచర్ల గ్రామాలకు చెందిన రైతులు డి.ముప్పవరం ప్రధాన సెంటర్‌లో నిరసన తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోయి తీవ్రంగా నష్టపోయామన్నారు. రైతులు ఉప్పల శ్రీనివాస్, జల్లేపల్లి వీరరాఘవులు మాట్లాడుతూ, రబీ ధాన్యం కొనుగోలు చేయకుండా ప్రభుత్వం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. నిడదవోలు మండలంలోని ఆయా ఆర్ఎస్‌కేల ద్వారా రబీలో 8,600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు. ప్రతి గింజా కొంటామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ వెంటనే వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నెల రోజుల నుంచి మిల్లులకు ధాన్యం తోలిన 605 మంది రైతులకు రూ.8.22 కోట్లు చెల్లించాలని, డబ్బులు ఎప్పుడు పడతాయో సంబంధిత అధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకూ ఆందోళన విరమించేది లేదని రైతులు నినదించారు. వ్యవసాయ శాఖ కొవ్వూరు అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఏఎస్ఓ నాగాంజనేయులు, మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఎస్సై కె.వీరబాబు అక్కడకు చేరుకుని, రైతులతో చర్చించారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నా విరమించారు. రైతుల ఆందోళనతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. కార్యక్రమంలో రైతులు నిచ్చెనకోళ్ల కృష్ణమూర్తి, కామన కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో చర్చిస్తున్న కొవ్వూరు ఏడీఏ చంద్రశేఖర్, ఏఎస్ఓ నాగాంజనేయులు

రత్నగిరి.. భక్తజన సాగరం

- సత్యదేవుని దర్శించిన 60 వేల మంది
- 5 వేల వ్రతాల నిర్వహణ
- దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం

అన్నవరం: ఒకవైపు వేసవి సెలవులు, మరోవైపు వివాహాల సందడితో రత్నగిరి శనివారం భక్తజనసాగరాన్ని తలపించింది. సత్యదేవుని ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట పట్టింది. భక్తుల రద్దీ తట్టుకోలేక మధ్యాహ్నం ఒంటిగంట వరకూ అంతరాలయ దర్శనం రద్దు చేశారు. మొత్తం 60 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు. ఐదు వేల వ్రతాలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.60 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు 6 వేల మంది సత్యదేవుని అన్న ప్రసాదం స్వీకరించారు. సత్యదేవుని ప్రాకార సేవ ఘనంగా నిర్వహించారు.



వ్రత మండపాల వద్ద భక్తుల రద్దీ

భక్తులకు ఇక్కట్లు

భక్తులు రూ.300 వ్రతాల నుంచి రూ.2 వేల వ్రతాల వరకూ గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో పిల్లలు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రూ.1,500 వ్రతాలాచరించే భక్తులను అనివేటి మండపం లోపలకు అనుమతించకపోవడంతో గుమ్మం వద్దనే సుమారు గంటసేపు నిలబడాల్సి వచ్చింది. దేవస్థానంలో వైఫై, సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌లు పని చేయకపోవడంతో ఫోన్‌పే, పేటీఎం వంటి డిజిటల్ యాప్స్, క్రెడిట్ కార్డుల ద్వారా వివిధ సేవా టికెట్లు కొనుగోలు చేసే భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. వ్రతాల టిక్కెట్ల వద్ద తీవ్ర రద్దీ ఏర్పడటంతో ఇదే అదనుగా కొంతమంది ముందుగా వ్రతాల టికెట్లు కొనుగోలు చేసి, బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయించారు.

అనాథ బాలలకు 'ఆధార్' ఇవ్వండి




సమావేశంలో మాట్లాడుతున్న జానీ బాషా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): అనాథ బాలబాలికలను కనుగొని, వారికి ఆధార్ కార్డు ఇవ్వాలని, చదువు లేని వారికి విద్యావకాశం కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) ఇన్‌చార్జి సెక్రటరీ షేక్ జానీ బాషా సూచించారు. డీఎల్ఎస్ఏ కార్యాలయంలో 'సర్వే ఫర్ ఆధార్ అండ్ యాక్సెస్ టు ట్రాకింగ్ అండ్ హోలిస్టిక్ ఇన్‌క్లూజన్ ఆన్ 13 మే 2025' సాథీ కమిటీ సర్వే సభ్యులకు శనివారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యంగా లేని బాలబాలికలకు వైద్య సేవలు, ఉచిత న్యాయ సలహాలు అందించడంపై సభ్యులంతా పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సాథీ కమిటీ సర్వే ఈ నెల 26 నుంచి వచ్చే నెల 26 వరకూ నిర్వహించాలన్నారు. వీధుల్లో, వసతి గృహాల్లో ఉన్న 18 సంవత్సరాల లోపు అనాథ బాలికలను గుర్తించి, ఆధార్ కార్డు కల్పించడమే సాథి సర్వే ముఖ్యోద్దేశమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బి.జగదీష్‌కుమార్, మండలాల తహసీల్దార్లు, విద్య, ఆరోగ్య, పోలీసు, రెవెన్యూ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారులు, బాలల సంరక్షణాధికారులు, ప్యానల్ లాయర్లు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్లాన్.. అట్టర్‌ఫ్లాప్

- ఉమ్మడి జిల్లాలో నిలిచిపోయిన నిర్మాణాలు
- ప్లాన్‌లు ఇవ్వడానికి సర్వేయర్ల నిరాకరణ
- పుర ప్రజలకు గుదిబండగా జీఓ–20



కాకినాడ నగరం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి సర్కారు అనాలోచిత నిర్ణయాలు ప్రజలకు గుదిబండగా మారుతున్నాయి. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిపోయిందనే చందంగా సర్కారు నిర్ణయాలు తయారయ్యాయనే విమర్శ వస్తోంది. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా వ్యవస్థల్లో ప్రభుత్వం తెస్తున్న మార్పులతో మొదటికే మోసం వస్తోంది. మూడు నెలల క్రితం సెల్ఫ్ సర్టిఫికేషన్ స్కీమ్ (ఎస్‌సీఎస్) కోసం విడుదల చేసిన జీఓ–20 నగరాలు, పట్టణాల్లో నిర్మాణాలకు అవరోధంగా మారింది. ఈ జీఓ దెబ్బకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగరాల్లో ఎక్కడి ప్లాన్‌లు అక్కడే చతికిలపడ్డాయి. ఈ జీఓ అమలులోకి వచ్చినప్పటి నుంచి భవన నిర్మాణదారులు లబోదిబోమంటున్నారు. సంపన్నుల నుంచి మధ్య తరగతి వరకూ వారి స్థాయికి తగ్గట్టుగా నిర్మించుకునే ఇళ్లకు ముహూర్తాలు చూసుకుంటారు. అన్నీ చూసుకుని పనులు మొదలు పెట్టాలంటే ముందుగా బిల్డింగ్ ప్లాన్‌లకు అనుమతి రావాలి. దీనిని ప్రభుత్వం ఇప్పుడు పట్టణాలు, నగరాల్లో నిర్మాణదారులకు పెద్ద సమస్యగా మార్చేసి, చుక్కలు చూపిస్తోంది. కొత్తగా భవనాలు నిర్మించుకోవాలనే వారికి మున్సిపల్ ప్లాన్‌లు ఇచ్చేందుకు సర్వేయర్లు ముందుకు రావడం లేదు.

గతంలో ఇలా..

పట్టణాలు, నగరాల్లో ఎవరైనా కొత్తగా ఇల్లు కట్టుకోవాలంటే ముందుగా లైసెన్స్‌డ్ సర్వేయర్ లేదా ఇంజినీర్‌ను సంప్రదించి, ప్లాన్ రెడీ చేసుకుంటారు. దరఖాస్తు, ప్లాన్‌తో పాటు సంబంధిత సొమ్మును కార్పొరేషన్ లేదా మున్సిపాలిటీకి చెల్లించిన అనంతరం ఆ ఫైల్ ఆన్‌లైన్‌లో పట్టణ ప్రణాళికా విభాగానికి చేరుతుంది. న్యాయ, సాంకేతికపరమైన అంశాలతో పాటు నిబంధనలను పరిశీలించిన తర్వాత టౌన్‌ప్లానింగ్ విభాగం భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే భవనం నిర్మిస్తున్న వారిపై టౌన్ ప్లానింగ్ విభాగం చర్యలు తీసుకుంటుంది.

ఇప్పుడు సర్వేయర్‌దే బాధ్యత

కూటమి సర్కారు కొత్తగా జారీ చేసిన జీఓ–20 ప్రకారం ఈ నిబంధనలన్నీ పక్కన పెట్టారు. ప్లాన్ గీసిన సర్వేయర్ లేదా ఇంజినీర్ పైనే మొత్తం బాధ్యత పెట్టారు. ప్లాన్ వేసిన అనంతరం సర్వేయర్లు బేస్‌మెంట్, లింటల్, స్లాబ్‌లు.. ఇలా వివిధ దశల్లో ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్లాన్ ప్రకారం నిర్మాణం జరగకపోతే ఆ విషయాన్ని కూడా ప్లాన్ వేసిన సర్వేయరే అప్‌లోడ్ చేయాలి. వాస్తవానికి ఈ ప్రక్రియను మున్సిపల్ యంత్రాంగం పర్యవేక్షించాలి. అన్ని అధికారాలూ ఉండే మున్సిపల్ అధికారులకు కాకుండా తమపై ఈ బాధ్యత పెడితే ఎలాగని సర్వేయర్లు ప్రశ్నిస్తున్నారు. నిర్మాణాల్లో ఎక్కడైనా ఉల్లంఘనలుంటే ప్లాన్ వేసిన సర్వేయర్ లైసెన్సును ఐదేళ్ల పాటు రద్దు చేస్తారు. భారత న్యాయ సంహిత (బీఎన్ఎస్) ప్రకారం వారిని బాధ్యులను చేస్తారు. ఇదెంతవరకూ సహేతుకమని సర్వేయర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ జీఓ పుణ్యమా అని సర్వేయర్లు ప్లాన్‌లు ఇచ్చేందుకు మూడు నెలలుగా ముందుకు రావడం లేదు. ప్లాన్ వేస్తే ఎక్కడ చిక్కుల్లో పడతామోననే భయంతో వారు ఒకవిధంగా పెన్‌డౌన్ చేస్తున్నారనే చెప్పవచ్చు. ఒక ప్లాన్ తయారు చేసి, అప్‌లోడ్ చేసి, అనుమతి లభిస్తే భవన యజమాని నుంచి రూ.ఐదారు వేలు, మరీ ఎక్కువైతే రూ.10 వేలు వస్తాయి. ఈ జీఓ అమలు పుణ్యమా అని చేయని తప్పునకు తామెందుకు బాధ్యత వహించాలని సర్వేయర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ జీఓ ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని దాదాపు అన్ని నగరాలు, పట్టణాల్లో మూడు నెలలుగా ప్లాన్‌లు నిలిచిపోయాయి. దీనిపై భవన నిర్మాణదారులు ఆందోళన చెందుతున్నారు.

జీఓలో నిబంధనలు సడలించాలి



జీఓ–20లోని కొన్ని నిబంధనలను మార్పు చేయాల్సి ఉంది. లైసెన్స్ హోల్డర్లకు అనుకూలంగా మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ప్రభుత్వం మా సూచనలను పరిగణనలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నాం. కొన్ని సాంకేతిక సమస్యలు సవరించడం ద్వారా ఈ జీఓ మరింత ఫలవంతమవుతుంది. భవన నిర్మాణాల్లో యజమానులు ఉల్లంఘనలకు పాల్పడితే అందుకు లైసెన్స్ సర్వేయర్లను బాధ్యులను చేయడం సరైంది కాదు. ఈ విషయాన్ని మున్సిపల్ మంత్రి నారాయణకు విన్నవించాం. జీఓ అమలులో లైసెన్స్ హోల్డర్ల హక్కులు, బాధ్యతలు సమతుల్యంగా ఉండేలా చూడాలి.

– సత్తి రాంబాబు, అధ్యక్షుడు, వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్స్

ఇది పరిస్థితి

- కాకినాడ నగరపాలక సంస్థలో సుమారు 100 మంది సర్వేయర్లున్నారు. ప్లాన్‌ల ద్వారా కార్పొరేషన్‌కు ప్రతి నెలా తక్కువలో తక్కువ రూ.40 లక్షల ఆదాయం వస్తూంటుంది. గడచిన మూడు నెలలుగా రూ.రెండు మూడు లక్షలు కూడా రావడం లేదు. సుమారు వెయ్యి ప్లాన్‌లు ఆగిపోయాయని చెబుతున్నారు.
- సామర్లకోట మున్సిపాలిటీలో నలుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్ల వద్దకు గతంలో నెలకు 10 నుంచి 15 దరఖాస్తులు వచ్చేవి. ఏడాదికి సుమారు 120 ప్లాన్లు అప్‌లోడ్ అవడంతో రూ.52 లక్షల ఆదాయం వచ్చేది. జీఓ–20 కారణంగా దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదు.
- పెద్దాపురం మున్సిపాలిటీలో నలుగురు సర్వేయర్లున్నారు. ప్లానింగ్ ద్వారా నెలకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకూ ఆదాయం వచ్చేది. ఇప్పుడు రూ.లక్ష వస్తే గొప్పన్నట్టుగా ఉంది. ప్రస్తుతం ప్లాన్‌లు ఇవ్వడం లేదు.
- తుని మున్సిపాలిటీలో 20 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లు ప్రతి నెలా 60 వరకూ ప్లాన్‌లు ఇచ్చేవారు. అప్పట్లో నెలకు రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ ఆదాయం వచ్చేది. జీఓ–20 అమలులోకి వచ్చాక ప్లాన్‌లు నిలిచిపోయాయి.
- రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) పరిధిలో సుమారు 250 మంది ప్రైవేట్ సర్వేయర్లు ఉన్నారు. ప్రస్తుతం నెలకు 20 నుంచి 30కి మించి దరఖాస్తులు రావడం లేదు.
- నిడదవోలు మున్సిపాలిటీలో నలుగురు ప్రైవేటు సర్వేయర్లున్నారు. ఏటా ప్లాన్‌ల కోసం 10 దరఖాస్తులు వచ్చేవి. జీఓ–20 విడుదలైన తరువాత ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.
- అమలాపురం మున్సిపాలిటీలో 20 మంది ప్రైవేటు సర్వేయర్ల వద్దకు జీఓ–20కి ముందు ప్రతి నెలా 25 నుంచి 35 బిల్డింగ్ ప్లాన్ దరఖాస్తులు వచ్చేవి. ఈ జీఓ వచ్చిన తరువాత సర్వేయర్లు ప్లాన్‌లు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు.
- మండపేట మున్సిపాలిటీలోని 15 మంది ప్రైవేటు సర్వేయర్లు నెలకు సుమారు 20 ప్లాన్‌లు ఇస్తుంటారు. మున్సిపాలిటీకి నెలకు రూ.40 వేల ఆదాయం వస్తుంది. జీఓ–20తో నెలకు కేవలం మూడంటే మూడే దరఖాస్తులు వస్తున్నాయి. సర్వేయర్లు ప్లాన్‌లు తయారు చేయడం ఆపేశారు.

క్లుప్తంగా

రీ వేల్యుయేషన్‌లో పెరిగిన మార్కులు




అబ్దుల్ సలామ్ పి.రమ్యశ్రీ

నల్లజర్ల: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మార్కులు తక్కువ రావడంతో దూబచర్ల సంఘమిత్రా స్కూల్ విద్యార్థులు షేక్ అబ్దుల్ సలామ్, పి.రమ్యశ్రీలు రీ వేల్యుయేషన్‌కు దరఖాస్తు చేశారు. షేక్ అబ్దుల్‌కు సోషల్ సబ్జెక్ట్‌లో 13 మార్కులు కలిశాయి. దీంతో 586 మార్కులతో స్కూల్ టాపర్‌గా, మండలంలో 4వ స్థానం సాధించాడు. పి.రమ్యశ్రీకి హిందీలో 10 మార్కులు కలిశాయి. దీంతో ఆమెకు 513 మార్కులు వచ్చాయి. ఈ విషయాన్ని ఆ స్కూల్ డైరెక్టర్ అంబటి శ్రీనివాసరావు శనివారం విలేకర్లకు తెలిపారు.

పని మనిషే నిందితురాలు



నిందితురాలి వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణభగవాన్

సామర్లకోట: ఇంట్లో పని మనిషి చోరీ చేసిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. సీఐ ఎ.కృష్ణభవాన్ కథనం ప్రకారం.. స్థానిక అంబటివారి తోటలోని సింగవరపు సత్యనారాయణ ఇంట్లో బొడ్డు దుర్గాదేవి పని చేస్తోంది. ఆ ఇంట్లో ఎవరూ లేని సమయంలో విలువైన వజ్రాలు, వాచ్, బంగారు ఆభరణాలు చోరీ చేసింది. చోరీ విషయాన్ని గమనించిన సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీలమ్మ చెరువు వద్ద ఉన్న పని మనిషి దుర్గాదేవిపై అనుమానంతో ఇంటికి వెళ్లి సీఐ కృష్ణభవాన్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు. ఆమె ఇంట్లో బంగారు ఆభరణాలు, 17 చిన్న డైమండ్స్, ఒక స్మార్ట్ వాచ్‌ను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ. ఆరు లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. ఈ మేరకు వీఆర్వో ఎస్.ఏడుకొండలు సమక్షంలో ఆమె నుంచి వాంగ్మూలం సేకరించగా నేరాన్ని అంగీకరించిన్నారు. నిందితురాలిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారని చెప్పారు. చోరీ సొత్తును రికవరీ చేసిన సీఐ కృష్ణభగవాన్, క్రైమ్ సీఐ అంకబాబు, సిబ్బందిని డీఎస్పీ డి.శ్రీహరిరాజు అభినందించారు.

అమ్మా నాన్నా లేరని.. ఇక రారని

- చలించిన పసి హృదయాలు
- కళ్లెదుటే తల్లిదండ్రుల మృతితో షాక్ అయిన పిల్లలు
- జాతీయ రహదారి దేవరపల్లి వద్ద హృదయ విదారక ఘటన

దేవరపల్లి / గోకవరం : పసిప్రాయం చిన్నబోయింది.. తల్లిదండ్రులు తమ కళ్లెదుటే మృత్యువాత పడడం చూసి గుండె ఆగినట్టు అయ్యింది. తమ అలనాపాలనా చూసే అమ్మానాన్న విగతజీవులుగా పడి ఉండడం చూసి ఆ పసివాళ్లు గుండెలవిసేలా రోదించడం చూపరులను కంటతడి పెట్టించింది.. తల్లిదండ్రులతో కలసి నానమ్మ ఇంటికి వెళుతున్నామన్న ఆ చిన్నారుల ఆనందం అంతలోనే ఆవిరైంది. అనుకోని ప్రమాదంలో తల్లిదండ్రుల మృతితో ఆ చిన్నారులు అనాథలయ్యారు. ఈ హృదయ విదారక ఘటన వివరాల్లోకి వెళ్తే..

తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన పేదూరి పెదబేబీ (30), దేవరపల్లి సమీపంలో యాదవోలుకు చెందిన తుంటా దుర్గాప్రసాద్ (35)కు సుమారు 13 ఏళ్ల కిందట వివాహం అయ్యింది. వివాహం అనంతరం దుర్గాప్రసాద్ గోపాలపురంలోనే తాపీ చేస్తుండగా, పెదబేబీ అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తుంది. వీరిద్దరికి కుమార్తె ప్రవల్లిక, కుమారుడు ఇమ్మానుయేల్ ఉన్నారు. కుమార్తె వీరలంకపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 6వ తరగతి, కుమారుడు గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు కావడంతో శనివారం మధ్యాహ్నం భార్యాభర్తలు ఇద్దరూ పిల్లలను తీసుకుని యాదవోలుకు బైక్‌పై బయలుదేరారు. వీరు గుండుగొలను – కొవ్వూరు మధ్య జాతీయ రహదారిపై దేవరపల్లి డైమండ్ జంక్షన్‌కు వచ్చేసరికి ఆ ఇద్దరు పిల్లలు టాయ్‌లెట్ వస్తోందనడంతో రోడ్డు పక్కన బైక్ ఆపారు. పిల్లలను రోడ్డుకు అటువైపు టాయ్‌లెట్‌కు పంపించారు. తన సోదరుడికి తీసుకు వెళుతున్న మామిడి పండ్లను దుర్గాప్రసాద్ సర్దుకుంటుండగా వెనుక నుంచి అతివేగంగా లారీ వచ్చి భార్యాభర్తలను ఢీకొంది. ఈ ప్రమాదంలో పెదబేబీ, దుర్గాప్రసాద్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, టాయ్‌లెట్‌కు వెళ్లిన పిల్లలు సురక్షితంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ కాలు తెగి దూరంగా పడిపోయింది. తమ కళ్ల ఎదుటే తల్లిదండ్రులు మృత్యువాత పడడంతో పిల్లలు ఒక్కసారిగా షాక్‌లోకి వెళ్లిపోయారు. ఘటనా స్థలానికి దేవరపల్లి సీఐ కె.నాగేశ్వర్ నాయక్, ఎస్సై వి.సుబ్రహ్మణ్యం చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.



అనాథలైన తమ్ముడు, అక్క ఇమ్మానుయేల్, ప్రవల్లిక



దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో రోడ్డు ప్రమాద ప్రాంతం

ఆనందం ఆవిరి

అప్పటి వరకూ తల్లిదండ్రులతో ఆనందంగా గడిపిన పిల్లలు తల్లిదండ్రులు ఇక లేరని తెలుసుకుని కన్నీరు మున్నీరవుతున్నారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రుల దుర్మరణంతో ప్రవల్లిక, ఇమ్మానుయేలు దిక్కులేని వారిగా మిగిలారు. ప్రమాద ఘటనను కళ్లారా చూసిన ఆ చిన్నారులు షాక్‌కు గురయ్యారు. అమ్మానాన్నలు కావాలంటూ రోదిస్తున్నారు.

గోపాలపురంలో విషాదం

భార్యాభర్తలు మృతి చెంది పిల్లలు అనాథలు కావడంతో గోపాలపురంలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. గ్రామస్తులతో సత్సంబంధాలు కలిగిన వీరు ప్రమాదంలో మృతి చెందారన్న విషయాన్ని గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. అనాథలైన చిన్నారులను తలుచుకుని కన్నీరుమున్నీరు అవుతున్నారు.



తుంటా దుర్గాప్రసాద్, పెదబేబీ (ఫైల్)

మధ్యాహ్నం తాపీ పని ముగించుకుని..

దుర్గాప్రసాద్ గ్రామంలో తాపీ పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం వరకూ పనిచేసి ఇంటికి వచ్చిన అతను భార్యాపిల్లలతో కలసి సరదాగా గడిపేందుకు తన గ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. నాలుగు రోజుల కిందట పెదబేబీ తన భర్త దుర్గాప్రసాద్‌తో కలసి గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో తోటి అంగన్‌వాడీ టీచర్‌కు సంబంధించిన ఫంక్షన్‌లో పాల్గొంది. ఈ సమయంలో తమతో కలసి ఎంతో సందడి చేసిందని ఇంతలోనే ఇలా జరిగిందని, సహచర అంగన్‌వాడీ సిబ్బంది బోరున విలపించారు.

నేడు పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్: అమలాపురం హెల్త్ అండ్ ఫిట్‌నెస్ జిమ్, స్పోర్ట్స్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక నర్ సీవీ రామన్ స్కూల్ ప్రాంగణంలో 3వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరీస్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ పోటీలు ఆదివారం జరుగుతాయని ఆ జిమ్ కోచ్ డాక్టర్ కంకిపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలు మెన్, వుమెన్ విభాగాల్లో ఉంటాయన్నారు. ఇందులో పాల్గొని సత్తా చాటేందుకు ఇప్పటికే ఉభయ గోదావరి జిల్లాల నుంచి 130 మంది పవర్ లిఫ్టర్లు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఈ పోటీలకు 150 మందికి పైగా క్రీడాకారులు హాజరు కానున్నారని వెంకటేశ్వరరావు వివరించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల స్థాయిలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీలకు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సహకారం అందిస్తుందన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,500
గటగట (వెయ్యి)	20,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	21,500
గటగట (వెయ్యి)	19,500
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,500 – 14,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రాం ప్రారంభం



ఐఐఎఫ్‌టీ సర్టిఫికెట్ ప్రోగ్రాం ప్రారంభోత్సవంలో పాల్గొన్న అధ్యాపకులు

బాలాజీచెరువు (కాకినాడ): స్థానిక జేఎన్‌టీయూలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఫారిన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) క్యాంపస్‌లో గురువారం ఎగుమతి–దిగుమతి నిర్వహణపై సర్టిఫికెట్ ప్రోగ్రాం ప్రారంభమైంది. దీనిని ఆన్‌లైన్‌లో ఐఐఎఫ్‌టీ వీసీ రాకేష్‌మోహన్ జోషి ప్రారంభించి మాట్లాడుతూ ప్రస్తుత భౌగోళిక రాజకీయాలు, దాని అనిశ్చితి తెలుసుకోవడంతో పాటు అంతర్జాతీయ వ్యాపారాన్ని నిర్మించడంలో ఈ ప్రోగ్రామ్ ఏవిధంగా సహాయపడుతుందో వివరించారు. ఈ సందర్భంగా ఐఐఎఫ్‌టీ కాకినాడ హెడ్ రవీంద్రసారథి మాట్లాడుతూ ఎగుమతి, దిగుమతి నిర్వహణలో అంతర్జాతీయ వాణిజ్యంలో నైపుణ్యాలను పెంపొందించడానికి ఇది మంచి విలువైన కోర్సు అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలతో పాటు పరిశ్రమల నిపుణులు, విద్యావేత్తలు, సహచరులతో సంబంధాలు ఏర్పరచుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సర్టిఫికెట్ ప్రోగ్రాం అసిస్టెంట్ ప్రొఫెసర్ సిద్ధార్థ శంకర్‌రాయ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మట్టిమాయం చేసేందుకు...

- దందాకు తెర లేపిన టీడీపీ
- వాటాలు పంచుకుంటున్న వైనం
- కూటమిలో భాగస్వాములకు మొండిచేయి

గోపాలపురం: మట్టి దందాకు తెరలేపారు.. అందినకాడకు తవ్వేస్తున్నారు.. అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. గోపాలపురం మండలం గంగోలు, భీమోలు, కరిచర్లగూడెం, గోపాలపురం గ్రామాల్లోని పెద్ద చెరువుల్లో మట్టి అక్రమ తవ్వకాలు ప్రారంభించారు. నిబంధనల ప్రకారం చెరువులో మట్టిని తరలించుకునేందుకు ప్రభుత్వానికి నామమాత్రంగా ఫీజు చెల్లించి ఆయకట్టు రైతులు తీసుకోవచ్చు. అనుమతులు వచ్చాక ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై మట్టిని తరలించుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. దీనికి నీళ్లు వదిలి అసలు రైతులకు కాకుండా ఆయా గ్రామాల టీడీపీ నాయకులు మట్టిని ఇటుక బట్టీలకు లారీల్లో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. స్థానిక రైతులకు మొండిచేయి చూపి మట్టిని రాత్రనక పగలనక ఒక్కో చెరువులో రెండు జేసీబీలు, 15 లారీలతో తరలిస్తున్నారు.



గోపాలపురం మండలం గంగోలు పెద్దచెరువులో జేసీబీలతో మట్టి తవ్వకాలు

గంగోలు పెద్ద చెరువు నుంచి ఏలూరు జిల్లా పోలవరం మండలంలో ఇటుక బట్టీలకు మట్టిని తీసుకెళ్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాల్లో నియోజకస్థాయి ప్రతినిధి వాటాగా 70 శాతం, మిగిలిన 30 శాతం స్థానిక టీడీపీ నాయకులు పంచుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. రెండు వేల క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకుని, 15 వేల క్యూబిక్ మీటర్లకు తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత ఇరిగేషన్ అధికారులు ఇటువైపు చూడడం లేదు. మట్టి తరలింపు లారీల రాకపోకలతో ఆయా గ్రామాల్లో రోడ్లు ఛిద్రంగా మారుతున్నాయని, లారీలో తరలించే మట్టి సుమారు 40 నుంచి 45 టన్నుల బరువు ఉండటంతో రోడ్లు గోతులు పడుతున్నట్లు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మరిన్ని గ్రామాల్లో మట్టిని అక్రమంగా తరలించడానికి ఆయా గ్రామాల టీడీపీ నాయకులు సన్నాహాలు చేస్తున్నారు.

తవ్వకాలపై ఫిర్యాదులకు..

కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బీజేపీ నాయకులకు టీడీపీ నాయకులు మొండిచేయి చూపిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏ గ్రామంలోనూ వారికి వాటాలు ఇవ్వకపోవడంతో ఆయా పార్టీల నాయకులు అధిష్టానానికి తెలియజేసేలా, మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదులు చేసేందుకు కార్యాచరణ చేసుకున్నట్లు సమాచారం.

శ్రీనివాసా... శ్రీవేంకటేశా

- కిక్కిరిసిన వాడపల్లి క్షేత్రం
- వర్షాన్నీ లెక్క చేయకుండా తరలివచ్చిన భక్తులు



వాడపల్లి ఆలయం వద్ద ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కొత్తపేట: దినదిన ప్రవర్ధమానంగా.. ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న వాడపల్లి క్షేత్రం భక్తజనంతో పులకించింది. ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవీ, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి క్షేత్రానికి శనివారం తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చారు. 'ఏడు శనివారాలు– ఏడు ప్రదక్షిణలు' నోము ఆచరిస్తున్న భక్తుల గోవింద నామస్మరణతో క్షేత్రం మార్మోగింది. నిత్య కల్యాణమూర్తి అయిన వేంకటేశ్వరస్వామిని నూతన దంపతులు దర్శించుకుని తరించారు. దేవదాయ –ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంతశ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితుల బృందం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. పూర్ణాలంకరణలో ఉన్న స్వామివారిని దర్శించుకున్న భక్తులు పులకించారు. అనంతరం ఆలయ ఆవరణలో క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తర్వాత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం 5 గంటల వరకూ స్వామివారి ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, అన్న ప్రసాద విరాళం, వివిధ సేవలు, లడ్డూల విక్రయం, ఆన్‌లైన్ తదితర సేవల ద్వారా దేవస్థానానికి రూ.48,99,380 ఆదాయం వచ్చిందని ఈఓ చక్రధరరావు తెలిపారు. ఎస్సై రాము ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

కారు ఢీకొని యువతి దుర్మరణం

తగరపువలస (విశాఖ జిల్లా): సంగివలస వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణా జిల్లా చాట్రాయ్ మండలం ఎర్రవారిగూడేనికి చెందిన ఉప్పలపాటి తిరుమలాదేవి (24) అక్కడికక్కడే మృతి చెందింది. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామానికి చెందిన పిల్లి వెంకటేష్ ఓ కారులో కాకినాడ నుంచి విజయనగరం జిల్లా భోగాపురం వైపు వెళ్తున్నారు. కారును నిర్లక్ష్యంగా నడపడంతో సంగివలస ముగ్గురు అమ్మవార్ల ఆలయం సమీపంలో డివైడర్‌ను దాటి అవతలి వైపునకు దూసుకెళ్లింది. కాగా.. భీమిలి మండలం చిప్పాడలోని దివీస్ లేబొరేటరీలో కెమిస్ట్‌గా పనిచేస్తున్న తిరుమలాదేవి విధులకు హాజరయ్యేందుకు మరో ముగ్గురు సహోద్యోగినులతో కలసి అనిట్స్ బస్టాప్ వద్దకు చేరుకుంది. తాము ఎక్కాల్సిన ప్రైవేట్ బస్సు అప్పటికే ఆనందపురం వైపు వెళ్లిపోయింది. ఈ సందర్భంలో ఆ బస్సు అందుకునేందుకు వెళ్తుండగా వేగంగా దూసుకొచ్చిన కారు తిరుమలాదేవిని బలంగా ఢీకొంది. తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే ఆమె మృతి చెందింది.

విద్యుదాఘాతానికి తాపీమేస్త్రి మృతి



సుంకరరాజు (ఫైల్)


జగ్గంపేట: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందినట్లు జగ్గంపేట ఎస్సై రఘునందన రావు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జగ్గంపేట గ్రామానికి చెందిన సుంకరరాజు (35) తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. అతను స్థానిక బాలాజీ నగర్‌లో ఓ ఇంట్లో తాపీపని చేస్తున్నాడు. శనివారం యథావిధిగా ఉదయం పనిలోకి వచ్చిన రాజు శ్లాబ్ వేసే నిమిత్తం కర్రలు కోస్తుండగా కర్రలు కోసే మెషీన్ వైర్లు ప్రమాదవశాత్తూ తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని స్థానిక ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మహిళకు గాయాలు

పిఠాపురం: గొల్లప్రోలు 216 జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా, ఒక మహిళకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. కత్తిపూడి నుంచి పిఠాపురం వైపు వెళుతున్న పాల ట్యాంకర్ గొల్లప్రోలు టోల్‌గేట్ దగ్గరకు వచ్చేసరికి బ్రేక్ వేయడంతో దాని వెనుక వస్తున్న ఆటో అదుపు తప్పి ట్యాంకర్‌ని ఢీకొంది. ఆటోలో ఉన్న డ్రైవరు గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన మేడిద ధర్మేంద్ర వరప్రసాద్ (34), అదే గ్రామానికి చెందిన బి.లోవకుమారిలకు గాయాలయ్యాయి. ఇందులో వరప్రసాద్ మృతి చెందగా, లోవకుమారి చికిత్స పొందుతోంది. గొల్లప్రోలు ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువకుడు..



వంశీకృష్ణ (ఫైల్)

రాజోలు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఏఎస్సై కె.నరసింహారావు కథనం ప్రకారం.. శుక్రవారం రాత్రి పొదలాడకు చెందిన బత్తుల వంశీకృష్ణరాజు (19) పాల ప్యాకెట్ కోసం మోటార్ సైకిల్‌పై ఆ గ్రామంలో సెంటర్‌కు వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా.. తాటిపాక నుంచి మోటార్ సైకిల్‌పై రాజోలు వస్తున్న కొప్పాడి రాజీవ్, మొగలి గణేష్‌లు ఢీకొట్టారు. దీంతో వంశీకృష్ణరాజు తలకు తీవ్రగాయం కావడంతో వైద్యం నిమిత్తం అమలాపురం కిమ్స్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వంశీకృష్ణ విజయవాడలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడి మృతితో తండ్రి బత్తుల దొరరాజు కన్నీరు మున్నీరుగా విలపించారు. దొరరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై తెలిపారు.